

కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు రెండు డయాలసిస్ యూనిట్లు




ప్రజాశక్తి- పలాస

పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు కొత్తగా మరో రెండు డయాలసిస్ యూనిట్లు రానున్నాయని ఎమ్మెల్యే గౌతు శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసిఎఎన్‌యుకు గతంలో రాసిన లేఖకు స్పందించారని చెప్పారు. ఈ మేరకు ఆంధ్రా మెడికల్ కాలేజీ అలుమ్నీ ఆఫ్ నార్త్ అమెరికా రూ.15 లక్షలు విలువ చేసే రెండు డయాలసిస్ యూనిట్లు అందించేందుకు సముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ నెలాఖరు నాటికి డయాసిన్ యూనిట్లను అమర్చనున్నట్లు తెలిపారు.

కూటమిలో కుతకుత

- ప్రభుత్వ కార్యక్రమాల్లో టిడిపి శ్రేణులదే హవా
- నీటిసంఘాల ఎన్నికల్లోనూ వారికే పదవులు
- తమకు అవకాశం కల్పించడం లేదని భాగస్వామ్య పక్షాల మథనం
- నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయం



కూటమి పార్టీలోని భాగస్వామ్య పక్షాలైన టిడిపి, జనసేన, బిజెపి మధ్య క్రమేణా అంతరాలు పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఎన్నికల ముందు నాటి ఉత్సాహం ఇప్పుడు కనిపించడం లేదు. ఎన్నికల సందర్భంలో గెలుపు కోసం సమన్వయ కమిటీ సమావేశాలను ఏర్పాటు చేసి చొరవ చూపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అటువంటి సమన్వయ సమావేశాలేవీ నిర్వహించకపోవడంతో జనసేన, బిజెపి నాయకులు, శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఎన్నికల ప్రచార సమయంలో టిడిపి నేతలు మిత్రపక్షాల ఇళ్లకు వెళ్లి కొందరు, ఫోన్లు చేసి మరీ ప్రచారంలో అంతా కలిసి తిరిగారు. ఎనిమిది నెలల తర్వాత పరిస్థితి ఏకంగా మారిపోయిందని ఆయా పార్టీల నాయకులు, శ్రేణులు మథనపడుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడి పోటీ చేశాయి. సీట్ల సర్దుబాటులో భాగంగా జిల్లాలోని ఎనిమిది స్థానాలకు గానూ ఏడు చోట్ల టిడిపి, ఒక చోట బిజెపి పోటీ చేశాయి. మూడు పార్టీలు ఉమ్మడిగానే ప్రచారం సాగించాయి. జిల్లాల్లో పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మూడు పార్టీలకు వచ్చిన సీట్లను బట్టి నామినేటెడ్ పదవులను కేటాయించాలన్న నిర్ణయం

ముందే మేలుకున్న జనసేన

రాష్ట్రవ్యాప్తంగా మూడు పార్టీలు కలిసి నిర్ణయించిన మేరకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు దక్కినా, జిల్లాకొచ్చేసరికి ఆ మేరకు వారికి స్థానం లభించడం లేదన్న అభిప్రాయం నెలకొంది. ప్రభుత్వం ఐదు విడతలుగా భర్తీ చేసిన నామినేటెడ్ పదవుల్లో టిడిపితో పాటు జనసేన, బిజెపి నాయకులకు పలు కార్పొరేషన్లకు చైర్మన్, డైరెక్టర్ పదవులను పొందారు. అదే జనవరిలో నిర్వహించిన నీటిసంఘాల్లో జనసేనకు నాలుగైదు చోట్ల చైర్మన్ పదవులు దక్కగా, బిజెపికి అదీ లేదు. ప్రభుత్వం త్వరలో పిఎసిఎస్‌లకు పర్సనల్ ఇన్‌ఛార్జీలను నియమిస్తున్నట్లు ప్రకటించడంతో, జనసేన ముందే మేల్కొంది. మండలంలో నాలుగు పిఎసిఎస్‌లు ఉంటే అందులో రెండు, ఆరు ఉంటే నాలుగు పర్సన్ ఇన్‌ఛార్జి పదవులు ఇవ్వాలని టిడిపి ముందు డిమాండ్‌గా పెట్టినట్టు సమాచారం.

మిత్రపక్షాలను విస్మరిస్తున్న టిడిపి

ఎన్నికల ముందు సమన్వయ కమిటీ సమావేశాలకు ఫోన్లు చేసి మరీ పిలిచిన టిడిపి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత తమను పట్టించుకోవడం లేదంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకూ తమను ఆహ్వానించడం లేదనే అసంతృప్తి వారిలో గూడు కట్టుకుని ఉంది. అరసవల్లి రథసప్తమి వేడుకలను మూడు రోజుల పాటు నిర్వహించినా ఎక్కడా జనసేన, బిజెపి నాయకులను భాగస్వామం చేయలేదనే చర్చ పార్టీ శ్రేణుల్లో సాగుతోంది. సమీక్షా సమావేశాలకూ వారిని పిలవడం లేదన్న ఆవేదన ఆయా పార్టీ నాయకుల్లో నెలకొంది.

మేరకు జిల్లాలో పలువురు జనసేన, బిజెపి నాయకులకు పదవులు దక్కాయి. కానీ జిల్లాకు సంబంధించిన కొన్ని రకాల పదవుల్లో వారికి టిడిపి నేతలు స్థానం దక్కనీయడం లేదన్న ఆవేదన ఇరు పార్టీల్లో నెలకొంది. గతేడాది డిసెంబరులో నిర్వహించిన సాగునీటి సలహా సంఘాల ఎన్నికల్లో జనసేన కోరిన ప్రాంతాల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను ఇవ్వడానికి టిడిపి నాయకులు నిరాకరించడంతో అప్పట్నుంచి జనసేన, బిజెపి నాయకుల్లో అసంతృప్తి మొదలైంది.

లోకేష్ దృష్టికి జిల్లా వ్యవహారాలు

జిల్లాలో తమకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదన్న అంశంపై తీవ్రంగా మథనపడుతున్న జనసేన, బిజెపి నాయకులు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం. జిల్లాకు చెందిన టిడిపి, జనసేన, బిజెపి అధ్యక్షులు గత నెలలో సమావేశమై దీనిపై చర్చించినట్లు తెలిసింది. శ్రీకాకుళం జిల్లాతో పాటు అన్ని జిల్లాలోనూ జరుగుతున్న పరిమాణాలను పార్టీ పరిశీలిస్తోందని, వచ్చే నెలలో పిఠాపురంలో జరిగే ప్లీనం సమావేశాల్లో దీనిపై చర్చ ఉంటుందని జనసేన పార్టీకి చెందిన ఓ ముఖ్య నాయకుడు చెప్పారు. అంతర్గతంగా అసంతృప్తులు ఉన్నా, ఇప్పటివరకు ఎవరూ బహిర్గతం కాలేదు. కూటమి పార్టీ అధినేతలు ఇచ్చిన ఆదేశాలతో వారంతా మౌనంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో పిఎసిఎస్, మార్కెట్ కమిటీలు వంటి పదవుల భర్తీలో నీటిసంఘాల తరహాలో టిడిపి ఏకపక్షంగా వెళ్తే జనసేన, బిజెపి నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశాలు లేకపోలేదని కొందరు నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. కూటమి పార్టీలో నెలకొన్న అంతరాలు ఎటువైపునకు దారితీస్తాయోనన్న ఆందోళన మూడు పార్టీల శ్రేణుల్లో నెలకొంది.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



శ్రీకాకుళం అర్బన్ : ధర్నా చేస్తున్న సిఐటియు, రైతుసంఘాల నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక హక్కులు పరిరక్షించాలని, ఆహార పంటలకు కనీస మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతూ సిఐటియు, కార్మిక, రైతుసంఘాల ఆధ్వర్యాన బుధవారం నగరంలోని ఆర్అండ్‌బి రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వచ్చి అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికవర్గం అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కోవిడ్ కాలంలో దుర్మార్గంగా పార్లమెంట్‌లో, బయట ఎటువంటి చర్చ జరగకుండా లేబర్ కోడ్‌లను ఆమోదించిందన్నారు. మోడీ మూడో ప్రభుత్వంలో అమలు చేయడానికి సిద్ధంగా ఉందని, ఎప్పుడైనా అమలు ఉత్తర్వులు ఇస్తామని ఇటీవల ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వర్గానికి ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి హక్కులను కుదించడమే లేబర్ కోడ్‌ల ముఖ్య ఉద్దేశమన్నారు. కార్మిక హక్కులు కాలరాసి పెట్టుబడిదారులకు పెద్దపీట వేయడానికి లేబర్ కోడ్‌లు వచ్చాయని చెప్పారు. కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా పనిచేయించి దోపిడీని మరింత తీవ్రతరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. కార్మికులను హైర్ అండ్ ఫైర్ పద్ధతిలో ఇష్టం వచ్చినట్లు తొలగించవచ్చని, ఫిక్స్‌డ్ టెర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో పర్మినెంట్ కార్మికులను నోటీసు ఇవ్వకుండా, తొలగింపు బెనిఫిట్స్ ఇవ్వకుండా తొలగించవచ్చన్నారు. కంపెనీల లేఆఫ్, లాకౌట్, మూసివేతలు 300 మంది లోపు ఉంటే ప్రభుత్వ అనుమతి అవసరం లేదని, దీనివల్ల 90 శాతం మంది కార్మికులు చట్టపరిధికి బయటకు వెళ్తారన్నారు. కార్పొరేట్లు కోరుతున్నట్లు పనిగంటలు ఇష్టం వచ్చినట్లు పెంచవచ్చని చెప్పారు. అందుకే ఎల్ అండ్ టి యజమాని సుబ్రమణ్యం నేడున్న నెలకు 48 గంటల బదులు 90 గంటలు కార్మికులు పనిచేయాలని డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. యజమానులు ఏ చట్టాల అమలును ఉల్లంఘించినా తనిఖీలు లేకుండా చేశారని తెలిపారు. అందువల్లే ప్రతిరోజు కార్మికులు పరిశ్రమల్లో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. లేబర్ కోడ్‌ల వల్ల ప్రాణానికే భద్రత లేకుండా పోయిందని, యజమానులకు గతంలో ఉన్న జైలు శిక్షలు లేకుండా చేశారని చెప్పారు. పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్, కనీస వేతనాలు అమలు వంటి ప్రాథమిక చట్టాల అమలుకు అధోగతి పట్టిందన్నారు.

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సింహాచలం మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని అన్నారు. వ్యవసాయానికి, గ్రామీణాభివృద్ధికి నిధులు తగ్గించారని విమర్శించారు. ఉపాధి హామీకి సరిపడా నిధులు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎన్.వి రమణ, ఎ.సత్యనారాయణ, ఆర్.ప్రకాష్, కె.సూరయ్య, పి.గోపి, అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.కళ్యాణి, రాజేశ్వరి, ఆశా వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు డి.ధనలక్ష్మి, పి.జయలక్ష్మి, మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ బి.ఉత్తర, సుశీల, వి.లక్ష్మి, పలు యూనియన్ల నాయకులు డి.వాసుదేవరావు, టి.త్రినాథరావు, ఎల్.రామప్పడు, బి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పలాస : స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సిఐటియు, ఎఐటియుసి, ఎఐసిసిటియు ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ముందుగా పలాస జూనియర్ కళాశాల ప్రాంగణం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వద్దకు ర్యాలీ నిర్వహించారు. ధర్నా అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ ఎఒకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ, ఎఐటియుసి నాయకులు సిహెచ్.వేణుగోపాల్, ఎఐసిసిటియు నాయకులు కె.కామేశ్వరరావు జీడి కార్మిక సంఘం నాయకులు సిహెచ్.జానకమ్మ, జి.బాలమ్మ, బి.చంద్రావతి, కుసుమ, రైతుసంఘం నాయకులు టి.అజయ్ కుమార్, జుత్తు సింహాచలం పాల్గొన్నారు.


పలాస : ధర్నా చేస్తున్న కార్మిక, రైతుసంఘాల నాయకులు

10న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలోని అన్ని అంగన్వాడీ, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు ఈ నెల 10న పక్కాగా వేయించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం నిర్వహించారు. ఈ మాత్రలు తీసుకోవడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంఘాలు భాగస్వాములు కావాలన్నారు. ఈ నెల 10న డీ-వార్మింగ్ డే, 17న మాప్ అప్ డే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 17న మాప్ అప్ కార్యక్రమంలో వివిధ కారణాల రీత్యా మాత్రలు వేసుకోని వారిని గుర్తించి ఆ రోజు మాత్రలు వేయించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో 1 నుంచి రెండేళ్ల వరకు పిల్లలకు సగం మాత్ర, 3 నుంచి 19 ఏళ్ల వరకు గల విద్యార్థులతో పాటు పాఠశాలలకు వెళ్లని పిల్లలకు అంగన్వాడీ కార్యకర్తలు ద్వారా మాత్రలు వేయించాలన్నారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనం తర్వాత ప్రతి విద్యార్థికీ ఒక మాత్రను వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తల సమన్వయంతో నమిలి తినిపించాలని పేర్కొన్నారు. చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని పాఠశాలలకు, కళాశాలలకు మాత్రలు పంపిణీ చేసేందుకు ఆయా పిహెచ్‌సిల్లో సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలమురళి మాట్లాడుతూ చిన్నారులు, విద్యార్థులందరికీ అల్బెండజోల్ మాత్రల పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో 4,46,982 మందికి మాత్రల పంపిణీ చేయాల్సి ఉండగా, ఐదు లక్షలకు పైగా మాత్రలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడి బి.శాంతిశ్రీ, డిఇఒ తిరుమల చైతన్య, డిపిఎంఒ బి.రవీంద్ర, డెమో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసనలు


వజ్రపుకొత్తూరు : ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యాన బుధవారం బెండి, నగరంపల్లి గ్రామాల్లో ప్రజలు నిరసన తెలిపారు. ఈ మేరకు బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కోర్నన బాలాజీరావు, మ్మినేని భాస్కరరావు, సిఐటియు నాయకులు ఎన్.మోహనరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కేవలం అదానీ, అంబానీ లాంటి సంపన్నులకు తప్ప రైతులకు, వ్యవసాయ కూలీలకు, కార్మిక వర్గానికి ఎలాంటి లాభం చేకూర్చే కాదని విమర్శించారు. కార్యక్రమంలో కోనారి హేమసూదనరావు, రెళ్ల నీలాచలం, కోనారి ఆనంద్, యానాది లోకేష్, సర్వశుద్ధి మోహనరావు, నిర్మల, టి.లక్ష్మి, జి.కోదండ, దువ్వాడ ఆనందరావు నాయుడు. ఎన్.ధనలక్ష్మి, ఎన్.సోములు పాల్గొన్నారు.

పలాస : కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రైతాంగ వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా బుధవారం మాకన్నపల్లిలో ప్రతులను ఎపి జీడి రైతు సంఘం ఆధ్వర్యాన దహనం చేశారు. ఈ సందర్భంగా జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రానికి కొత్త సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జీడి పంటను కేంద్ర పంటల జాబితాలో చేర్చి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తెప్పల అప్పలస్వామి, గేదెల నీలకంఠం, బత్తిన ప్రసాద్, తెప్పల రాజు, జుత్తు వరలక్ష్మి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధుల కోత, కార్మిక రంగంలో లేబర్ కోడ్లు అమలుకు వ్యతిరేకంగా స్థానిక చిన్నబజార్ కూడలి వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నంబూరి షణ్ముఖరావు, జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.ఈశ్వరరావు, రైతు సంఘం నాయకులు బగాది వాసుదేవరావు, జోగి కుమార్, ఎన్.శంకర్, ఎస్.వెంకటరావు, గేదెల వసంతులు, పి.ధనుంజయ, కమలమ్మ, దేవి పాల్గొన్నారు.

జి.సిగడాం: కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని, సామాన్యులకు ఎటువంటి ప్రయోజనం చేకూర్చేలా లేదని ఎపి రైతు సంఘం, జిల్లా కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ అన్నారు. రైతు, సామాన్యుల వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా మండలం సేతుభీమవరంలో ఎపి రైతు సంఘం, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. కార్యక్రమంలో పోకతోట రాంబాబు, శాకాబత్తుల రమణ, అప్పారావు, బొల్లి జమ్మినాయుడు, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


జి.సిగడాం : పత్రులను దహనం చేస్తున్న రమణ తదితరులు


పలాస : నిరసన తెలుపుతున్న జీడి రైతు సంఘం నాయకులు



టెక్కలి రూరల్ : నిరసన తెలుపుతున్న నాయకులు


శ్రీకాకుళం అర్బన్ : ధర్నా చేస్తున్న బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ధర్నా...

శ్రీకాకుళం అర్బన్: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయోజనాలను పక్కన పెట్టి కార్పోరేట్ల ప్రయోజనాన్ని కాపాడేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌ను రూపొందించిందని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోలాకి వెంకటరావు, మాతల గోవర్ధనరావులు ఆరోపించారు. నగరంలోని సంచార భవన్ వద్ద ఉద్యోగులు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ యూనియన్ నాయకులు అభిమన్యు, అరుణ, శ్రీను, హెచ్ ఢిల్లేశ్వరరావు, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా



ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా వ్యాప్తంగా వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గాన పరిష్కరించుకునేందుకు అత్యున్నత న్యాయస్థానం మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసినట్టు జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా వివరించారు. అందులో భాగంగా బుధవారం కోర్టు భవనంలో న్యాయమూర్తులతో, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ప్రజలు రాజీ పడదగ్గ సివిల్, క్రిమినల్ కేసులు రాజీ చేసుకోవడానికి చక్కటి అవకాశమన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకునేందుకు వీలుగా న్యాయవాదులు కక్షిదారులతో ఆలోచన చేయాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

12న కుంభమేళాకు ప్రత్యేక బస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజయకుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ రాజ్‌లో నిర్వహిస్తున్న మహా కుంభమేళాకు జిల్లా నుంచి ఈ నెల 12న ప్రత్యేక బస్సు బయలుదేరుతున్నట్టు జిల్లా ప్రజారవాణాశాఖాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కుంభమేళా యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 12న రాత్రి 8 గంటలకు కొత్త సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందన్నారు. ఏడు రోజుల పాటు ఏడు క్షేత్రాలను సందర్శించేందుకు వీలుగా ఈ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం భోజనం, రాత్రి, ఉదయం టిఫిన్ అందజేయనున్నట్టు వివరించారు. ఒక్కో వ్యక్తి నుంచి రూ.9,500 ఛార్జి వసూలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం 20 సీట్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో 1,2 డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

యంత్రాంగం కృషి ప్రశంసనీయం

ఎమ్మెల్యే గొండు శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు విజవంతంగా నిర్వహించిన రథసప్తమి వేడుకల్లో జిల్లా యంత్రాంగం కృషి ప్రశంసనీయమని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో ఉన్న ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ ఉత్సవాల్లో సుమారు 1.20 లక్షల మంది యాత్రికులు సందర్శించినట్టు అధికారిక లెక్కల తెలిపాయని అన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా యంత్రాంగం ఏర్పాట్లు చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర పండగగా ప్రకటించిన తర్వాత స్వల్ప వ్యవధిలోనే పక్కాగా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ వేడుకలపై శ్రద్ధ చూపిన కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏటా ఇదే తరహాలో మరింత మెరుగైన ఏర్పాట్లతో ఉత్సవాలు నిర్వహించేందుకు వీలుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రసాదం స్కీంలో చేర్చడం వల్ల అరసవల్లి ఆలయం మరింత అభివృద్ధి చేసేందుకు వీలవుతుందన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన సాంస్కృతిక వేడుకలతో పాటు క్రీడలు జిల్లా స్థాయిని పెంచాయన్నారు. రథసప్తమి రోజున ఆలయాన్ని సందర్శించుకునేందుకు యాత్రికులకు కల్పించిన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో నగరాన్ని సుందరీకరణ చేపడుతున్నట్టు వివరించారు. సమావేశంలో టిడిపి నాయకులు రెడ్డి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరందించాలి

ప్రజాశక్తి- పలాస

వంశధార శివారు భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని వంశధార నీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ సంఘం అధ్యక్షుడు గొనవ నిరంజన్ అధికారులను కోరారు. ఇటీవల వంశధార కాలువలు ఆధునికీకరణ పనులకు మండలానికి ప్రభుత్వం రూ.కోటి నిధులు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో మండలంలోని బ్రాహ్మణతర్లా, బంటుకొత్తూరు, నీలిభద్ర, నారాయణపురం తదితర వంశధార సాగునీరు అందిస్తున్న కాలువలను అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంశధార ప్రాజెక్టుకు సంబంధించిన మదుములు, పరుపులు, కాలువ గట్టుపై కంకర రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులు చేపట్టాలని అధికారులకు కోరారు. వీటిని ఆధునికీకరణ చేయడం ద్వారా ప్రతి సెంటుకూ సాగునీరు అందుతుందన్నారు. కాలువ గట్లపై నడిచి వెళ్లేందుకు సౌకర్యకరంగా ఉంటుందన్నారు. రామన్న ఖరీఫ్ నాటికి పనులు పూర్తి చేయగలిగితే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఆ దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. ఆయనతో పాటు వంశధార ఎఇలు మీనాక్షి రాజశేఖర్, అమలకుడియా నీటి సంఘం అధ్యక్షులు వరిశ తారకేశ్వరరావు, ఉపాధ్యక్షులు సల్ల విశ్వనాథం, గుంట ఈశ్వరరావు, బెండి నీలకంఠం, వల్లభనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కాలువను పరిశీలిస్తున్న నిరంజన్

8 నుంచి నాటిక పోటీలు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బొరివంకలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో ఆహ్వానిత ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళింగ సేవ కళాపీఠం అధ్యక్షుడు బల్లెడ లక్ష్మణమూర్తి మాస్టారు తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. బల్లెడ అనసూయమ్మ స్మారక ఆహ్వానిత నాటిక పోటీల్లో భాగంగా 8న రాత్రి 7 గంటలకు సాయి ఆర్ట్స్ కొలకలూరు గుంటూరు జిల్లా సౌజన్యంతో జనరల్ భోగీలు, అదే రోజు రాత్రి 9 గంటలకు తెలుగు కళాసమితి విశాఖపట్నం వారి సౌజన్యంతో 'నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత?' అనే నాటికలు ప్రదర్శిస్తారని తెలిపారు. అలాగే 9న రాత్రి 7 గంటలకు పండు క్రియేషన్స్ కొప్పోలు (ఒంగోలు) సౌజన్యంతో పక్కింటి మొగుడు, అదే రోజు రాత్రి 9 గంటలకు అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం నాటికలు ప్రదర్శిస్తున్నట్టు పేర్కొన్నారు. పదిన రాత్రి 7 గంటలకు అభినయ ఆర్ట్స్ - గుంటూరు వారి సౌజన్యంతో ఇంద్ర ప్రస్థం, అదే రోజు రాత్రి 9 గంటలకు సౌజన్య కళా స్రవంతి ఉత్తరాంధ్ర వారి లిదేవరాగంలి నాటికను ప్రదర్శిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి కళాకారులు, కళాపిపాసులు, కళాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న పట్టణ ప్రజలు

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ సమీపంలో ఉన్న నేతాజీ నగర్‌లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతాజీ నగర్‌లో దీర్ఘ కాలిక సమస్యలు ఉన్నాయని, గత ప్రభుత్వంలో పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు.కాలువలు, రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావుతో మాట్లాడి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో మాజీ కౌన్సిలర్ ప్రతినిధి సైని వల్లభ, మర్రి మురళి, పోతనపల్లి గిరి, కణితి కృష్ణమూర్తి, యర్ర చిన్నారావు, ఉప్పాడ నారాయణరావు, కొవ్వూరు ధనంజయ ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

విప్‌ను కలిసిన వ్యాపారులు

ప్రజాశక్తి- సోంపేట

సోంపేటకు చెందిన పలువురు వ్యాపారస్తులు బుధవారం స్థానిక ప్రభుత్వ విప్ బెందాళం అశోకుని కలిశారు. ఈ సందర్భంగా సోంపేటలో తమ వ్యాపారాలు తగ్గిపోవడానికి గల కారణాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో పరిసర గ్రామాలకు బస్సులు లేకపోవడంతో వ్యాపారాలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. బస్సుల సర్వీసులు రాకపోకలకు అణువుగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతర కారణాలను గురించి తెలియజేశారు వ్యాపార అభివృద్ధికి సహకరించాలని కోరారు. తమ సమస్యలను వినతి రూపంలో ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో ఛాంబర్ ప్రతినిధులు మల్ల నాగేంద్ర, కె.రాంజీ, సాన రవి, ఎస్.శ్రీనివాస్, జె.సతీష్, ఇ.విష్ణుమూర్తి పాల్గొన్నారు.

రవికుమార్‌కు శుభాకాంక్షలు

ఆమదాలవలస: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ (పియుసి) చైర్మన్‌గా ఎమ్మెల్యే కూన రవికుమార్ ఎంపిక కావడంపై టిడిపి నాయకులు బుధవారం ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న రవికుమార్‌కు పియుసి చైర్మన్‌గా రవికుమార్‌ను ఎంపిక చేయడంపై టిడిపి జిల్లా పార్లమెంటరీ డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ చాపర సుధాకర్, ఆమదాలవలస బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మి, జిల్లా బిసి యాదవ సాధికార కమిటీ సభ్యులు నాగళ్ల మురళీధర్ యాదవ్, విశ్రాంత ఎంపిడిఒ మునగవలస రవీంద్రబాబు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు కారుణ్య ధర్మారావు, టిడిపి పట్టణ మహిళా అధ్యక్షులు బోయిన సునీత తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ తిరుమలరావు

కంచిలి హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి- కంచిలి

కంచిలి మండల కేంద్రంలోని బిసి బాలుర సంక్షేమ వసతిగృహాన్ని ఎంపిడిఒ వి.తిరుమలరావు, ఎంఇఒ ఎస్.శివరాం ప్రసాద్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపయోగిస్తున్న మరుగుదొడ్లు, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం రాత్రి భోజనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధమవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సిఎస్‌ఇ, ఎంసిఎ విభాగాల హెచ్‌ఒడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నరేష్ తంగుడు 'సైబర్ సెక్యూరిటీ' అనే పుస్తకాన్ని రచించారు. దీనికి కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ పుస్తకం ఆవశ్యకతను వివరిస్తూ సైబర్ నేరాలు పెరిగి పోతున్న ఈ తరుణంలో ఇటువంటి పుస్తకాల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు ఈ అంశంపై పూర్తి అధ్యయనం చేయాలన్నారు. రచయితను అభినందించిన వారిలో డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఉన్నారు.

కృష్ణదాస్ పరామర్శ

పోలాకి: మండలంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస బుధవారం పరామర్శించారు. రేగుపాడులో బిర్లంగి అన్నపూర్ణ, బెలమర పాలవలసలో యాల్ల తవిటమ్మ, అంబీరుపేటలో మల్ల కూర్మారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, యువజన విభాగం అధ్యక్షుడు ఆర్.త్రినాథరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సామాజిక భవనం

బూర్జ: లక్ష రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ధనం వృధా అవుతుంది. మండలంలోని గోపిదేవిపేట గిరిజన గ్రామంలో సీతంపేట సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సామాజిక భవనం ప్రారంభించక ముందే శిధిలావస్థకు చేరుకుంది. గ్రామంలో వివిధ కార్యక్రమాలకు వీలుగా నిర్మించిన భవనం నేడు నిరుపయోగంగా దర్శనమిస్తుంది. లక్షల వ్యయంతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదని గిరిజన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ సామాజిక భవనానికి మరమ్మతులు జరిపి వినియోగంలోకి తీసుకురావాలని గిరిజనులు కోరుతున్నారు.


నిరుపయోగంగా ఉన్న సామాజిక భవనం

బస్టాండ్ రోడ్డుకు మోక్షం


బస్టాండ్ రహదారిలో నిలిచిన ట్రాఫిక్


అంబేద్కర్ కూడలి సమీపంలో కొలతలు వేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- పొందూరు

ఎంతో కాలంగా మండల ప్రజలతో పాటు, పట్టణవాసులు ఎదురు చూస్తున్న బస్టాండ్ రహదారి విస్తరణ కల నెరవేరనుంది. దశాబ్దాలుగా ఇరుకైన రహదారిలోనే అవస్థలు పడుతూ వాహనాల రాకపోకలను సాగిస్తున్న ప్రజలకు అంబేద్కర్ కూడలి నుంచి బస్టాండ్ వరకూ గల రహదారికి మోక్షం కలగడంతో ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ చొరవతో అంబేద్కర్ కూడలి నుంచి బస్టాండ్ వరకూ సుమారు రూ.1.75కోట్ల

రూ.1.75 కోట్లతో రహదారి విస్తరణ

ఎస్‌ఆర్‌జిఎస్ నిధులతో సుమారు 500 మీటర్లు పొడవున, 15మీటర్ల వెడల్పు (సుమారు 50 అడుగులు)న రహదారిని విస్తరించనున్నారు. రహదారి విస్తరణలో భాగంగా ఇరువైపులా కాలువలతో పాటు, రహదారి మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేయనున్నారు. రహదారి విస్తరణకు సంబంధించి సర్వే రెవెన్యూ, పంచాయతీ అధికారులు బుధవారం కొలతలు చేపట్టారు. అంబేద్కర్ కూడలి నుంచి బస్టాండ్ వరకూ ఇరువైపులా హద్దులను గుర్తించి, కొలతలు చేపట్టారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గణపతి, పిఆర్ ఎఇ అనంత్, ఇఒ మోహన్‌బాబు, విఆర్‌ఒ ఈశ్వరరావు పాల్గొన్నారు.

తీరనున్న ప్రజల అవస్థలు

పట్టణంలోని అంబేద్కర్ కూడలి నుంచి బస్టాండ్ వరకూ ఇరుకైన రహదారులతో మండల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఎదురుగా భారీ వాహనాలు వచ్చాయంటే చాలు ఎక్కడికక్కడే ట్రాఫిక్ నిలిచిపోవాల్సిందే. ఒక్కోసారి కేవలం 500 మీటర్ల ప్రయాణానికి 10 నుంచి 15 నిమిషాలు సమయం పట్టే పరిస్థితి నెలకొంది. కాంప్లెక్స్‌కు బస్సులు వెళ్లాలన్నా, రావాలన్నా చాలా ఇబ్బందులు పడాల్సిందే. అంబేద్కర్ కూడలి నుంచి బస్టాండ్ వరకూ రహదారి పక్కన గల కాలువలను సైతం ఆక్రమించి వాటిపై కట్టడాలు చేపట్టడంతో వాహనాలు రాకపోకలకు ప్రజలు అవస్థలు పడడంతో పాటు, మరుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. అధికారులు చూస్తూ ఉండడమే తప్ప ఏమీ చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. అంతేకాకుండా దుకాణాలు పేర్లు సూచించే బోర్డులు సైతం రహదారిపైనే దుకాణాల యజమానులు పెట్టడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంటుంది. ఎట్టకేలకు ఎమ్మెల్యే చొరవతో బస్టాండ్ రహదారికి మోక్షం కలగడం, ఈ ఆక్రమణలను తొలగిపోతాయన్న ఆనందాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. రహదారి విస్తరణ పనులను త్వరితగతిన పూర్తిచేసి తమ కష్టాలను తీర్చాలంటూ ప్రజలు కోరుతున్నారు.


వంటలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ రాజారావు

పాఠశాల సందర్శన

నందిగాం : మండలంలోని జయపురం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఎంపిడిఒ టి.రాజారావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, వంటశాల మెనూ అమలు పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సింహాచలం, డిప్యూటీ వార్డెన్ ప్రకాశరావు, కార్యదర్శి గోపీనాథ్ పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని కొరసవాడలో ఉన్న ఉమాశంకర్ చేనేత సొసైటీ అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జాతీయ చేనేత సహకార సంఘం మాజీ సభ్యులు మంచు కృష్ణారావు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో విలేకరులతో మాట్లాడారు. గత 50 ఏళ్లుగా మంచు చంద్రయ్య ఈ సంఘానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు రూపొందించిన సంక్షేమ పథకాలను సైతం పక్కదారి పట్టించారని విమర్శించారు. 2023-24 చివరి ఆడిట్‌లో 370 మంది చేనేత సంఘం సభ్యులు ఉన్నట్టు జాబితాలో చేర్చారని తెలిపారు. అయితే ప్రభుత్వం నియమించిన పిఐసికి 132 మంది మాత్రమే ఉన్నట్టు జాబితా ఇస్తున్నారన్నారు. వీటిలో కూడా 28 మంది మాత్రమే మగ్గం కలిగిన చేనేత కార్మికులన్నారు. 2011లో రాష్ట్ర ప్రభుత్వం చేనేత సహకార సంఘాల రుణ పరపతి పూర్తిగా మాఫీ చేసిందని చెప్పారు. జిల్లాలో ఉమాశంకర చేనేత సహకార సంఘంలో అధికంగా రుణమాఫీ చేసినట్టు తెలిపారు. ప్రస్తుత ఆడిట్ రిపోర్టు ద్వారా రూ.45.98 లక్షల మేర నష్టంతో ఈ సంఘం నడుస్తున్నట్టు చెప్పడం హాస్యాస్పదమన్నారు. బినామీల పేరుతో పెద్దఎత్తున అవినీతి జరిగిందన్నారు. అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న సిఐ అవతారం, ఎస్‌ఐ చిరంజీవి

పోలీసుల సూచనలు పాటించాలి

రణస్థలం: మండలంలోని కమ్మ సిగడాంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 7 నుంచి 9 వరకు జరగనున్నాయని, భక్తుల సౌకర్యార్థం పోలీసుల సూచనలు పాటించాలని జె.ఆర్.పురం సిఐ అవతారం, ఎస్‌ఐ చిరంజీవి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 10వ తేదీ ఉదయం వరకు రణస్థలం నుంచి నెలిమర్ల వైపు వెళ్లే, అలాగే నెల్లిమర్ల నుంచి రణస్థలం వైపు వచ్చే లారీలు, వ్యాన్‌లు, భారీ వాహనాల రాకపోకలకు అనుమతి లేదన్నారు. రణస్థలం నుంచి నెల్లిమర్ల వైపు వెళ్లే వాహనాలు పైడి భీమవరం, సంచాం గ్రామాల మీదుగా వెళ్లాలని, రణస్థలం వచ్చే వాహనాలు సంచాం, పైడిభీమవరం మీదుగా రాకపోకలు సాగించాలని పేర్కొన్నారు. జాతర నిమిత్తం దేవాదాయ కమిటీ, పోలీసులు పార్కింగ్ స్థలాలను పెట్టడం జరిగిందని యాత్రికులు దిగువ పార్కింగ్ స్థలంలో మాత్రమే తమ వాహనాలు పార్కింగ్ చేసుకోవాలన్నారు. రణస్థలం నుంచి అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులు ఆలయ ఎంట్రెన్స్, యాగాటిపాలెం జంక్షన్, లోచర్ల పాలెం, లోచర్లపాలెం చెరువుగట్టు వద్ద పార్కింగ్ స్థలాల్లో మాత్రమే తమ వాహనాలు పార్కింగ్ చేయాలని సూచించారు. నెల్లిమర్ల వైపు నుంచి ఆలయానికి వచ్చే యాత్రికులు కమ్మ సిగడాం గ్రామం, పెట్రోల్ బంక్ వద్ద గల పార్కింగ్ స్థలాల్లో మాత్రమే వాహనాలు పార్కింగ్ చేయాలన్నారు. చీపురుపల్లి, నడిపిల్లి గ్రామాల వైపు నుంచి వచ్చే యాత్రికులు వేల్పురాయి గ్రామ కూడలి, కమ్మ సిగడాం కూడలి రైస్‌మిల్లులో, దేవరపల్లి విలేజ్ కూడలిలో ఇటుక బట్టీలో గల పార్కింగ్ స్థలాల్లో మాత్రమే వాహనాలు నిలపాలని సూచించారు. జాతరకు వస్తున్న యాత్రికులు వారి వాహనాలను పైన సూచించిన పార్కింగ్ స్థలాల్లో మాత్రమే పెట్టాలని, లేని యెడల సదరు వాహనాలపై అపరాధ రుసుం విధించబడునన్నారు. జాతరకు వచ్చే భక్తులు పైన తెలిపిన సూచనలు పాటిస్తూ ఆలయ కమిటీకి, పోలీసు వారికి సహకరించాలని కోరారు.

విజేతలకు అభినందన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కాకినాడ జెఎన్‌టియు యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో ఇటీవల ఫస్ట్ ఎన్‌టిఆర్ మెమోరియల్ టైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఇచ్ఛాపురం నుంచి విద్యార్థులు పాల్గొని ఓవరాల్ ఛాంపియన్‌షిప్ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ పోటీలో పతకాలు సాధించిన క్రీడాకారులకు మున్సిపల్ మైదానంలో బుధవారం కోచ్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి విజేతలకు అభినందించారు. సబ్ జూనియర్ విభాగంలో జి.హర్షిని గోల్డ్ మెడల్, పిలక లాస్యం రెడ్డి సిల్వర్ మెడల్, యశ్విత సిల్వర్ మెడల్, కృతజ్ఞ, సిల్వర్ మెడల్స్ దక్కించుకున్నారు. మనీష్, మోహిత్, మోక్ష, శ్రీవల్లి బ్రాంచ్ మెడల్ కైవసం చేసుకుంది. క్యారెట్ విభాగంలో సిహెచ్.జాహ్నవి సిల్వర్ మెడల్, పి.దమయంతి, ఎం.డి.నూరుద్దీన్, పి.విజ్ఞాన్ వంశీ బ్రాంచ్ మెడల్ కైవసం చేసుకున్నారు. జూనియర్ విభాగంలో హెచ్.గిరి, ఎ.రేవంత్, ఎన్.భగవాన్ గోల్డ్ మెడల్స్ కైవసం


అభినందిస్తున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

చేసుకున్నారు. టి.జీవన్‌కి సిల్వర్ మెడల్ దక్కింది. సీనియర్ విభాగంలో ఎ.భువనేశ్వరి గోల్డ్ మెడల్, ఎస్.లక్ష్మణరావు, ఎస్.గణేష్ కుమార్‌లకు పేరా విభాగంలో గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. పుంసే విభాగంలో పాలకొండ గేహనశ్రీ, బెస్ట్ పోమ్సే ప్లేయర్ అవార్డు దక్కింది. అన్నపూర్ణ, భువనేశ్వరి, పిలక సత్యశ్రీలు గోల్డ్ మెడల్స్ సాధించారు. సీనియర్ ప్లేయర్ జి.జ్యోతిష్‌రెడ్డికి బెస్ట్ రిఫరీ అవార్డు దక్కింది. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రతినిధి పిలక విజయభాస్కర్‌రెడ్డి, కాళ్ల దిలీప్, బత్తిన కృష్ణయ్య, ఎల్.సి.రావు, గ్రౌండ్ కమిటీ వెంకట్ రమణ, చాట్ల లోహిదాస్, ప్రభుత్వ హైస్కూల్ ఎస్ఎంసి చైర్‌పర్సన్ ఆసిలత, విజేతల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విఒఎపై విచారణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో సన్యాసిపుట్టుక గ్రామ సంఘం విఒఎపై కేశపురం ఎంపిటిసి ఫిర్యాదు ఇచ్చారు. ఈ ఫిర్యాదు మేరకు పిడిఆర్‌డిఎ ఆదేశాల మేరకు విచారణ అధికారిగా ఏరియా కో-ఆర్డినేటర్ సిహెచ్.రామ్మోహనరావు బుధవారం విచారణ చేపట్టారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఎం.ఈశ్వరి ప్రాజెక్టు నుంచి గౌరవ వేతనం రూ.పది వేలు రావడంలేదని లేదని, సంఘాల వద్ద లంచాల వసూలు చేస్తుందని, తనకు ఇష్టం వచ్చిన వారికి రుణాలు మంజూరు చేస్తుందని, గౌరవ వేతనం రానప్పుడు ఆమెకు ఎందుకు ప్రభుత్వం పనులు చేపడుతుందని ఎంపిటిసి ఫిర్యాదు చేశారు. ఆమెకు రూ.పది వేలు జీతం అయినా ఇవ్వాలని, లేకుంటే ఆమెను తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంపిటిసి ఇచ్చిన ఫిర్యాదులో ఉన్న ఆరోపణలపై విచారణ నిర్వహించారు. విచారణ అధికార సమక్షంలో గ్రామ సంఘ అధ్యక్షులు జానకమ్మ, సంఘ సభ్యులు లీడర్లు స్పందించారు. ఫిర్యాదులో అంశాలన్నీ నిరాధారమైనవని అన్నారు. ఈశ్వరి విఒఎ కాకుండా ప్రభుత్వం నుంచి 2019 తర్వాత రిజిస్టర్ అయ్యిందని, గ్రామ సంఘాలకు, గ్రామ సంఘ సేవ రుసుం రూ.పది వేలు రావడం లేదని అన్నారు. మిగతా మండలాల్లో కనీసం గౌరవ వేతనం లేకపోయినప్పటికీ ఇచ్ఛాపురం మండలంలో ఏడు మంది విఒఎలకు గ్రామ సంఘం ఆదాయం పెంచి రూ.5 వేలు గౌరవ వేతనం మంజూరు చేశామని చెప్పారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఎవరూ మా వద్ద ఎటువంటి లంచాలు వసూలు చేయట్లేదని, ఇది కేవలం వ్యక్తిగత ఆరోపణలు, కక్షలతో కూడుకున్నది మాత్రమేనని అన్నారు. గతంలో కూడా అనేక మార్లు ఇలాంటి ఫిర్యాదులు ఎంపిటిసి చేశారని అంటూ అందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విచారణలో ఏరియా కో-ఆర్డినేటర్ సిహెచ్.రామ్మోహనరావు, ఎపిఎం ఎస్.ప్రసాదరావు, స్త్రీనిధి మేనేజర్ కె.రాము, సిసిలు డి.లక్ష్మి, డి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


విచారణ చేస్తున్న అధికారులు


మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో వార్డులలోని పారిశుధ్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిషనర్ ఎన్.రామారావు సిబ్బందికి ఆదేశించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన నిర్మూలన, ఎప్పటికప్పుడు కాలువలు శుభ్రపరచడం, అన్ని వీధుల్లో ఓపెన్ డ్రెయిన్లతో లార్వా ఆపరేషన్ చేయించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే ఫాగింగ్ చేయడం, ముఖ్యంగా చెత్త నుంచి సంపద సృష్టించేందుకు మన పదార్థాలు లేకుండా చూడాలన్నారు. ఫ్రైడేను డ్రై డేగా పాటించాలని సూచించారు. అనంతరం వార్డుల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. 24వ వార్డులో ఇందిరాచౌక్ వద్ద ఉన్న డంపర్ బిన్లో గల గార్బిజన్ కాంపాక్ట్ వెహికల్తో పరిశుభ్రం చేయించారు. 13వ వార్డు తిలక్ నగర్ రోడ్డు స్వీపింగ్ పనులు పరిశీలించారు. పలాస జూనియర్ కళాశాల, మెగిలిపాడు ప్రాంతాల్లో పిచ్చి మెక్కలు తొలిగించే పక్రియను పర్యవేక్షించారు. 13వ వార్డు న్యూ కాలనీలో శానిటేషనేషన్‌పై అవగాహన కల్పించారు. కాశీబుగ్గ బస్టాండ్, అన్న క్యాంటిన్లను పరిశీలించారు. ఆయనతో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశే కీలకం

జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్న లత

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

విద్యార్థి దశే కీలకమని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. ఈ సందర్భంగా స్థానిక జూనియర్ ప్రభుత్వ కళాశాలలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులను ఆశీర్వదించారు. విద్యార్థి దశలోనే భవిష్యత్‌పై దృష్టిపెట్టాలన్నారు. ఎటువంటి అసాంఘిక చర్యల్లో పాల్గొనరాదన్నారు. ఒక్కసారి నేరాలుగా ముద్ర పడితే ఇక జీవితమంతా నాశనం అవుతుందని హెచ్చరించారు. అనంతరం క్రీడల్లో జాతీయ బహుమతి పొందిన విద్యార్థికి, ఉత్తమ విద్యార్థినిగా గుర్తించిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. అలాగే స్థానిక జూనియర్ కోర్టులో నిర్వహ్హంచిన ముందస్తు లోక్‌ఆదాలత్‌లో ఒక వరకట్న కేసు పరిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధాన అధ్యాపకులు సంతోషి, జిల్లా బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందరావు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు న్యాయ నిర్ణేతగా అజయ్ కుమార్


శ్రీకాకుళం అర్బన్: జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు న్యాయ నిర్ణేతగా టెక్కలి మండలం నౌపడ ఆర్ఎస్‌కు చెందిన పట్టీసపు అజయ్ కుమార్ నియమితులయ్యారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో ఈనెల 6 నుంచి 9 వరకు నాలుగురోజుల పాటు పురుషుల విభాగంలో జరగనున్న 70వ సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఆయన న్యాయ నిర్ణేతగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు భారత బాల్ బ్యాడ్మింటన్ సమాఖ్య ప్రధాన కార్యదర్శి వై.రాజారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈయన రాజాం మండలం పొగిరి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. అజయ్‌కుమార్ నియామకంపై పొగిరి జడ్‌పిహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఇ.సత్యారావు, శ్రీకాకుళం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోత పూర్ణచంద్రరావు, పి.వి.జి.కృష్ణంరాజు, చైర్మన్ సూర శ్రీనివాసరావు, కోశాధికారి బిహెచ్ అరుణ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు అభినందనలు తెలిపారు.


నోటీసులు అందజేస్తున్న ఇఒ వీరభద్ర స్వామి

ఆక్రమణలు తొలగిస్తాం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

కవిటి: 'గ్రంథాలయానికి దారేది?' అంటూ బుధవారం 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి వీరభద్రస్వామి గ్రంథాలయం పరిసరాలు పరిశీలించి ఆక్రమణదారులకు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయం ఉన్న పరిసరాల్లో నెయ్యిల లక్ష్మణరావు, గయా పుణ్యవతి బెహరా, మహేశం కృష్ణారావులు షాపులు నిర్వహిస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. వీరికి నోటీసులు అందించామని, నాలుగు రోజుల్లోగా ఆక్రమిత స్థలం ఖాళీ చేయమని చెప్పినట్టు తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌ఒ ఎస్.నారాయణ పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణారావు

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పాతపట్నం: పాతపట్నంలోని నీలకంఠేశ్వర స్వామి వారిని జిఎస్‌టి కమిషనర్ పూజారి కృష్ణారావు బుధవారం సందర్శించారు. ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహా శివరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ గుమస్తా సుదర్శన్, ఆలయ ప్రధాన అర్చకులు రుద్ర పంక్తి పార్వతీశం, కళ్యాణ స్వామి, ఆలయ సిబ్బంది పాలొన్నారు.


బోల్తా పడిన వాహనం

వ్యాన్ బోల్తా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న జర్నలిస్టు కాలనీకి టెంటు సామగ్రితో వెళ్తున్న వ్యాన్ బుధవారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. ఈ కాలనీకి వెళ్లేందుకు అసంపూర్తిగా నిలిపివేసిన రోడ్డు వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రెండేళ్లుగా కౌన్సిల్ ఆమోద ముద్ర వేసినా ఈ రోడ్డుకు మోక్షం కాలేదు. చిన్న రోడ్డే కదా? అని అధికారులు నిర్లక్ష్యం చేయడం వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.


కాలిపోయిన మ్యాక్సీ క్యాబ్ ముందు భాగం

మ్యాక్సీ క్యాబ్ దగ్ధం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని 4వ వార్డు పరిధిలోని సొట్టవానిపేటకు చెందిన లింగభేరి రామకృష్ణ మ్యాక్సీక్యాబ్‌కు గుర్తు తెలియని దుండగులు మంగళవారం రాత్రి నిప్పుపెట్టారు. క్యాబ్ డ్రైవర్ రామకృష్ణ పగలు కిరాయికి తిప్పి రాత్రిపూట తన ఇంటి దగ్గరలో నిలుపుదల చేసేవాడు. మంగళవారం రాత్రి కూడా అలాగే నిలుపుదల చేసి నిద్రిస్తున్న సమయంలో దుండగులు క్యాబ్‌కు నిప్పుపెట్టడంతో అగ్నికి ఆహుతైంది. ఎగసిపడిన మంటలను చూసి స్థానికులు రామకృష్ణకు సమాచారం ఇవ్వగా స్థానికుల సహాయంతో మంటలను అదుపు చేశారు. అప్పటికే సగానికి పైగా వాహనానికి చెందిన పలు భాగాలు దగ్ధమయ్యాయి. క్యాబ్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తనపై దుండగులు ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడడం బాధాకరమని రామకృష్ణ రోధిస్తున్నాడు. బుధవారం ఆమదాలవలస పోలీస్ స్టేషన్‌లో తన వాహనానికి దుండగులు నిప్పంటించారని మ్యాక్సీక్యాబ్ వాహనం కాలి పోయిందని వివరిస్తూ ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాల్సి ఉంది.


నేత్ర వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది, నాయకులు

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- పొందూరు

విజయనగరం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని రాపాకలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 78 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. ఇందులో 36 మందిని ఆపరేషన్లుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైద్యులు దివ్య, అనూరాధ, పిఆర్ఒ లక్ష్మణ్, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, మండల తెలుగుయువత అధ్యక్షులు ఖండాపు శ్రీనివాసరావు, జనసేన నాయకులు కొంచాడ చిన్నంనాయుడు, టిడిపి నాయకులు గొల్లయ్య, మహేష్, సన్యాసిరావు, మనోహర్, రామకృష్ణ తదితరలు పాల్గొన్నారు.


నూతనంగా ఏర్పడిన కార్యవర్గం

బెంతు ఒరియా సంఘ అధ్యక్షునిగా రజనీకుమార్ దొలై

కవిటి: బెంతొరియాల సంఘం జిల్లా అధ్యక్షునిగా రజనీకుమార్ దొలై ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని కుసుంపురంలో బెంతొరియాలు బుధవారం సమావేశమయ్యారు. ఈ సమావేశం ఉపాధ్యక్షునిగా ఢిల్లీ మజ్జి, కార్యదర్శిగా గంగాధర్ సాహు, గౌరవాధ్యక్షునిగా మోహన్ సాహు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బెంతొరియా పెద్దలు దేవరాజు సాహు, భాస్కర్ దొళయి, మేఘనాథ్ బిశాయి, శివ బిసొయి బృందావన్, కృష్ణ బిసొయి, బిలాయి పెద్దలు జగబందు సాహు, విశాఖపట్నం పెద్దలు సావుకారి సాహు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

నరసన్నపేట: ప్రతిభ చూపించే విద్యార్థులకు ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ ఉండాలని, తద్వారా అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ అన్నారు. గతేడాది ఇంటర్మీడియేట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కళాశాల ఆవరణలో బుధవారం అభినందించారు. అలాగే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆరంగి అప్పన్నకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వాళ్ల ఉత్తమ ఫలితాలు సాధించడంలో ముందంజలో ఉంటారని అన్నారు. వచ్చే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. గత పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు తరగతుల వారీగా జ్ఞాపికలు, పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు నగదు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ వావిలపల్లి నారాయణస్వామి, సురవరపు సత్యనారాయణ, అప్పన్న సోమశేఖర్, డాక్టర్ మల్లేష్, వదనగిరి, లక్ష్మీనారాయణ, ఆనందరావు, జె.హరిప్రసాద్, కృష్ణవేణి, దుగ్గివలస రాంప్రసాద్, రవి, కె.హరిప్రసాద్, రూపవతి సురేష్, మొదలవలస ఈశ్వరరావు, స్వర్ణలత పాల్గొన్నారు.


అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పవన్


మెయిన్‌రోడ్డులో కురుస్తున్న మంచు

మంచు కురిసే వేళలో...

కోటబొమ్మాళి : చలికాలం పూర్తయి ఫిబ్రవరి మొదటి వారం అవుతున్నా..... ఉదయం వేళలో బారెడు పొద్దెక్కినా మంచు తెరలు తొలగక సూర్యకిరణాల కోసం నిరీక్షణ తప్పడం లేదు. బుధవారం జాతీయ రహదారిపై పరిస్థితి కొంత ఆందోళనకరంగానే ఉంది. నిండా పొగమంచు కురుస్తుండటంతో వాహనదారులు లైట్లు వేసుకుని నిదానంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ మాత్రం అశ్రద్ధ వహించినా ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయి. ఉదయం 10 గంటలైనా జాతీయ, గ్రామ రహదారుల్లో మంచుకురుస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క రబీలో వేసుకున్న అపరాలకు, మామిడి, జీడి పువ్వుదశలో ఉన్నందున మంచు ప్రభావంతో తీవ్రంగా దెబ్బతీస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న సంఘ సభ్యులు

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం


ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని జగతికేసుపురానికి చెందిన ఘన శ్యామ్ పాణిగ్రాహి అనే నిరుపేద బ్రాహ్మణ కుటుంబానికి ఒడియ బ్రాహ్మణ అర్చక సంక్షేమ సంఘం సభ్యులు బుధవారం ఆర్థికసాయాన్ని అందజేశారు అనారోగ్యంతో ఇటీవల ఘనస్యం పాణిగ్రాహి మృతి చెందారు. ఈ నేపథ్యంలో సంఘ సభ్యులు రూ.40 వేలు విరాళాలు సేకరించి అతని కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు షణ్ముఖ పాణిగ్రాహి, రమేష్‌కుమార్ పాణిగ్రాహి, వినోద్ పాణిగ్రాహి హేమచంద్ర పాణిగ్రాహి, విజయనాథ్ పాల్గొన్నారు.


గొయ్యిపై కప్పిన రాళ్లు, కర్రలు

శిథిలావస్థలో కల్వర్టు

మెళియాపుట్టి : మండలంలో రంపకాన -మందస రోడ్డులో గొప్పిలి సమీపంలో రహదారి కల్వర్టుకు రంధ్రం ఏర్పడింది. శిథిలమైన ఈ కల్వర్టును అభివృద్ధి చేయకపోవడంతో ఇక్కడ వాహనాలు రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. కల్వర్టు మరింత శిథిలం కాకుండా తక్షణం అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు పలువురు వాహనదారులు కోరుతున్నారు.


గుంపులుగా ఉన్న కుక్కలు

కుక్కల స్వైరవిహారం

నందిగాం : మండలంలో పలు గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గ్రామాల్లో ఎటు చూసినా కుక్కలు బెడద ఎక్కువగా ఉన్నాయి. దీంతో చేసేది లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నాయి. చిన్న పిల్లలు వీధుల్లో తిరిగితే వారి వెంట పరుగులు తీయించే పరిస్థితి కనిపిస్తుంది. సంబంధిత శాఖాధికారులు చొరవ చూపి కుక్కల బెడద నివారించాలని కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. బుధవారం మండలంలోని దూసిలో యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరు పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకొని పొదుపు చేయాలన్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఎవరైనా ఫోన్ చేసి ఎటిఎం పిన్‌కార్డు, బ్యాంకు అకౌంటు వివరాలను అడిగితే అటువంటి వారికి వివరాలు చెప్పవద్దని సూచించారు. అలాగే డిజిటల్ పేమెంట్స్ వ్యవస్థను వివరిస్తూ నగదు రహిత లావాదేవీలను కొన సాగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవన్ జ్యోతి, సురక్ష బీమా యోజన పథకాన్ని వివరించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ టోల్ ఫ్రీ నెంబర్ 14448 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టి జిల్లా కో-ఆర్డినేటర్ ఎ.హరినాథ్, సిఎఫ్ఎల్ సిబ్బంది బొడ్డేపల్లి చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ కె.సంతోషి కుమారి తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

పనితీరు మెరుగుపర్చుకోవాలి

ప్రజాశక్తి- పొందూరు

వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు తమ పనితీరును మెరుగు పర్చుకోకపోతే చర్యలు తప్పవని వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ పి.రవికుమార్ హెచ్చరించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం వెలుగు సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ప్రాజెక్టులో ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యత పనులు పూర్తిచేయడంలో సిసిల నిర్లక్ష్యం, పనితీరుపై ఆయన మండిపడ్డారు. జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలకు సంబంధించి పొందూరు మండలం బాగా వెనుకబడి ఉందన్నారు. స్త్రీనిధి, ఉమెన్‌లెడ్, పిఎంఇజిపి, జిఎంఎఫ్ఎంఇ వంటి కార్యక్రమాలను శతశాతం పూర్తిచేయాలని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఎస్‌హెచ్‌జి ఆడిట్ చేయాలన్నారు. పలు అంశాలకు సంబంధించి అప్పుల్లో ఆన్‌లైన్‌కు, ఆఫ్‌లైన్‌కు తేడాలు ఉండడంపై మండిపడ్డారు. అనంతరం పలు రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ ఉదయ్, ఎపిఎం రామ్మూర్తి, ఎసిసి నాగరాజు, సిసిలు రమణ, కృష్ణవేణి, రాజేశ్వరి, ప్రభ తదితరులు పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న ఎసి రవికుమార్

పరిసరాలను శుభ్రం చేయించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న గోపాల్

ప్రజాశక్తి- పలాస

అపరిశుభ్రంగా ఉన్న పలాస ఎన్‌జిఒ హోం పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేయాలని ఎపి ఎన్‌జిఒ అధ్యక్షులు బోనెల గోపాల్ కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కాశీబుగ్గ సంతమైదానం సమీపంలో ఉన్న ఎన్‌జిఒ హోం మట్టి, చెత్తచెదారంతో నిండి అపరిశుభ్రంగా తయారైందన్నారు. దీనిని కమిషనర్ పరిశీలించి అక్కడ పరిశుభ్ర వాతావరణం కల్పించిందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు చెత్తను రోడ్డుపై వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచిస్తూ, దీనిపై తక్షణమే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పాట్నూరు శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయకుమార్ పాత్రో, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతాడ రవి పరామర్శ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వైసిపి నాయకులు, కార్యకర్తలను వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పరామర్శించారు. బుధవారం మండలంలోని అక్కివరం సర్పంచ్ ప్రతినిధి గురుగుబెల్లి నీలారావు, దివంజిపేట వైసిపి నాయకులు గోవిందరావు, అలాగే బూర్జ మండలంలోని ఒపివాడ వెంకంపేటకు చెందిన వైసిపి నాయకులు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణ మూర్తిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఖండాపు గోవిందరావు, రాము, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


నీలారావును పరామర్శిస్తున్న రవికుమార్

మెళకువలు పాటించాలి



రైతులకు సూచనలు చేస్తున్న ఎఒ నరసింహమూర్తి

సోంపేట : గ్రామాల్లో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ నరసింహమూర్తి కోరారు. మండలంలోని ఎం.జి.పురం, బి.ఆర్‌.సి.పురం, కొర్లాం, పాలవలస గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెళకువలు పాటిస్తే నువ్వుల పంటలు అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు. రబీ కాలంలో మట్టి నమూనాలు సేకరించినట్లయితే ఖరీఫ్ కాలం నాటికీ ఫలితాలు వస్తాయన్నారు. పంట సాగులపై వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీకాంత్, ధనలక్ష్మి, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.


మోహనరావును అభినందిస్తున్న సురేష్ తదితరులు

యువతతోనే దేశ భవిత

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యావంతులైన యువకులు దేశ రక్షణ కోసం పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధికారి సైరిగాపు మోహనరావు అన్నారు. బుధవారం మండలంలోని తన స్వగ్రామమైన మర్రిపాడులో ఓ కార్యక్రమానికి విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శ్రీరామ యువజన సంఘం ప్రతినిధులు ఎడ్ల మన్మథరావు, కొల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యువత ఆయనను ఘనంగా సన్మానించారు. చిన్న గ్రామం నుంచి స్వయం కృషితో పోలీస్‌శాఖ ఉన్నతాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ గ్రామంలో ప్రతి అవసరానికి తనవంతు సహకారాన్ని అందిస్తున్న మోహనరావు ఆదర్శంగా నిలుస్తారని జిల్లా తూర్పుకాపు సాధికార అధ్యక్షులు పల్లి సురేష్‌తో పాటు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో జలుమూరు ఎస్ఐ బి.అశోక్ బాబు, వివిధ విభాగాలకు చెందిన పోలీస్‌శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థుల ప్రతిభ

నందిగాం : నియోజకవర్గస్థాయి పాఠశాల పోటీల్లో నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రతిభకనపరచి వివిధ పోటీల్లో గెలుపొంది గుర్తింపు తెచ్చారని వ్యాయామ ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల టెక్కలిలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో 9వ తరగతికి చెందిన కోనారి హర్షవర్ధన్ 200, 400 మీటర్ల పరుగు పందెం విభాగంలో ప్రథమ స్థానాన్ని సంపాదించడంతోపాటు వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ను సాధించారని అన్నారు. సీనియర్ విభాగంలో సనపల కృష్ణకిషోర్ 400 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానాన్ని పొందాని అన్నారు. ఏడో తరగతికి చెందిన బి.శ్రీనిధి, ఎం.పూజిత, సోనియా, ఎస్.సీతాలు ప్రథమ స్థానాన్ని గెలుపొందారని అన్నారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.హరిబాబు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కరుగుతున్న కొండలు

నందిగాం : మండలంలోని కొండల్లో అనాధికారికంగా తవ్వకాలు చేపట్టడంతో కనుమరుగవుతున్నాయి. గ్రామాల్లో గ్రావెల్ పేరుతో పలు ప్రాంతాల్లోని కొండల్లో యంత్రాలను ఏర్పాటు చేసి అనుమతులు లేకుండా అడ్డగోలుగా తరలించి సొమ్ములు చేసుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వారికి వరంగా మారింది. అక్రమ తవ్వకాలపై అధికారులు పర్యవేక్షణ చేపట్టి కొండలను సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. దీంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా కాపాడాల్సిన అధికారుల అలసత్వం వల్ల అక్రమ తవ్వకందారులకు కాసుల కురిపిస్తున్నాయని పలువురు గుసగుసలాడుతున్నారు. అధికారులు చొరవ చూపి అక్రమాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.


అక్రమ తవ్వకానికి గురైన బెలుకుల కొండ